సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



'కోడ్' ఎఫెక్ట్.. 8లో

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాజకీయ నాయకుల హోర్డింగులు, బ్యానర్ల తొలగిస్తున్నారు.



సర్దార్ వంతెన బంద్

నేవల్ డాక్‌యార్డ్ సమీపంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనను గురువారం నుంచి మూసివేశారు. 8లో



రామాద్రిలో షూటింగ్ సందడి

భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 8లో

న్యూస్‌రీల్

9 బస్సులపై కేసు నమోదు

3 బస్సుల సీజ్



స్కూల్ బస్సులను తనిఖీలు చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం : నగరంలో పలు చోట్ల చేపట్టిన రవాణా శాఖ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన తొమ్మిది స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేయడంతోపాటు మూడు బస్సులను సీజ్ చేశారు. ఇప్పటి వరకు తనిఖీల్లో మొత్తంగా 60 బస్సులపై కేసులు నమోదు చేయగా 8 బస్సులను సీజ్ చేశారు. అలాగే 25 ఆటోలపై కేసులు నమోదు చేయగా 5 ఆటోలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు బి.రాజారావు, ఐ.మాధవి, కె.శ్రీనివాస్, ఎస్.శిరీషా దేవి, వై.లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు



తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో నెలకొన్న ప్రతికూల వాతావరణం కారణంగా ఈ మార్గంలో నడిచే ప్రయాణికుల రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్‌లు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తాయి. ఈ నెల రెండు నుంచి 8వ తేదీ వరకు కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్, కిరండూల్-విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్‌లు దంతేవాడలో బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటాయి. ఈ తేదీల్లో ఈ రైళ్లను దంతేవాడ-కిరండూల్ మధ్య రద్దు చేశారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని ఆయన కోరారు.

4న శారీ వాక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: అంతరించిపోతున్న సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియజెప్పే ఉద్దేశంతో ఈ నెల 4న బీచ్‌రోడ్డులో 'శారీ వాక్' నిర్వహిస్తున్నట్లు ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వైసీహెచ్ దొరబాబు, డాక్టర్ సుధా పద్మశ్రీ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం బీచ్‌రోడ్డులో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గతేడాది 10 వేల మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారని.. ఈ ఏడాది ఇప్పటికే 8 వేల మంది నమోదు చేసుకున్నట్లు వివరించారు. విశ్వప్రియ ఫంక్షన్ హాలు నుంచి 3 కిలోమీటర్ల మేర నడక ఉంటుందని.. చేనేతను ప్రోత్సహించడం, మహిళల్లో ఆరోగ్య భద్రత పెంపొందించే లక్ష్యంతో ఈ ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 3, 4వ తేదీల్లో గాదిరాజు ప్యాలెస్‌లో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30 వరకు చేనేత వస్త్ర స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు. వాక్ ఫర్ కల్చర్, వాక్ ఇన్ హ్యాండ్‌లూమ్ పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రల్ ఫార్మసీ లైసెన్స్ రద్దు

మహారాణిపేట: కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెంట్రల్ ఫార్మసీ లైసెన్స్‌ను ఏడు రోజుల పాటు తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు. ఇటీవల సెంట్రల్ ఫార్మసీలో పనిచేస్తున్న పలువురు కార్మికులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలని డ్రగ్ అసిస్టెంట్ కంట్రోలర్‌ను ఆదేశించారు. ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ సెంట్రల్ ఫార్మసీకి నోటీసు జారీ చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు విచారణ జరిపారు. జాబ్‌మేళా ద్వారా సెంట్రల్ ఫార్మసీలో చేరిన తమను రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని ఇవ్వడం లేదని కార్మికులు వాపోయారు. ప్రతి రోజు 12 గంటలకుపైగా పనిచేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగంలో చేరినప్పుడు తెల్ల కాగితాలపైన సంతకాలు చేయించుకున్నారని వివరించారు. తమ సర్టిఫికెట్లు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు అధికారులు సెంట్రల్ ఫార్మసీ లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు.



పేదలను వంచించెన్

- సామాజిక పింఛన్లలో కోత విధించిన కూటమి ప్రభుత్వం
- రెండో నెలలో కూడా మరికొన్ని పింఛన్లు తప్పించిన నేతలు
- ఇప్పటి వరకు 2,681 మంది లబ్ధిదారులపై వేటు

నెల	పింఛన్ల సంఖ్య	కోత
జూన్	1,65,891	-
జూలై	1,64,150	1,741
ఆగస్టు	1,63,210	940
కూటమి ప్రభుత్వంలో కోత వేసిన మొత్తం పింఛన్లు		2,681

మహారాణిపేట: అనుకున్నట్టే కూటమి ప్రభుత్వం పింఛన్‌దారులకు వంచిస్తోంది. వరుసగా రెండో నెలలో కూడా కొంత మంది లబ్ధిదారులపై వేటు వేసింది. టీడీపీకి అనుకూలంగా లేరన్న అక్కసుతో స్థానిక నేతల ఒత్తిళ్లతో కొంత మంది పేరు తప్పించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల ఫలితాల ముందు వరకు పింఛన్లు అందించిన అధికారులు.. ఈ రెండు నెలల్లో కుంటిసాకులు చూపించి కొంత మంది పేర్లు తప్పించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ముున్ముందు సామాజిక పింఛన్లలో భారీగా కోతలు విధించే అవకాశాలు ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి.



పెదజాలారిపేట సచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు గాస్తున్న పింఛన్‌దారులు

2,681 మందికి కోత

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముందు వరకు 1,65,891 మంది పింఛనుదారులు ఉండేవారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఈ సంఖ్య తగ్గగా.. ఈ నెల సంఖ్య 1,63,210కి పడిపోయింది. ఈ గణాంకాల ప్రకారం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2,681 మంది లబ్ధిదారులపై వేటు వేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అయితే ఈ తగ్గింపు వెనుక సాంకేతిక కారణాలు చూపించడానికి అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. కొంత మందికి సర్వర్‌లో సమస్య, మరికొంత మందికి వచ్చే నెల నుంచి వస్తాయని, ఇంకొందరికీ మరో కారణం చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

భారం తగ్గించుకోడానికే..

ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు అలవికాని హామీలు గుప్పించారు. రూ.3 వేలు ఉన్న పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతానని హామీ ఇచ్చారు. తీరా అధికారం చేపట్టాక అది భారంగా మారినట్లు అర్థమైపోయింది. దీంతో కొంత భారాన్ని తగ్గించుకోవాలన్న నిర్ణయానికి కూటమి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు టీడీపీకి అనుకూలంగా లేరన్న కారణంతో కొందరి పేర్లను తప్పించాలని భావిస్తోంది. ఈ రెండు కారణాలతో పింఛన్లలో భారీగా కోత విధించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇందుకోసం గత ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిన ఐటీ రిటర్న్స్ ఆప్షన్‌ను మళ్లీ తెరపైకి తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఇతరత్రా నిబంధనలను సైతం మరింత కఠినతరం చేసి లబ్ధిదారుల సంఖ్య తగ్గించడం, తద్వారా భారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటికే వడపోతకు అవసరమయ్యే ప్రక్రియను అనధికారికంగా ప్రారంభించినట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించి విధి విధానాలు ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.



పెదజాలరిపేటలో అందరినీ ఒక చోటుకు పిలిపించి పింఛన్లు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

కోతలో కుట్ర : కూటమికి ఓటు వేయలేదని అనుమానంతో ప్రత్యర్థి పార్టీలకు సంబంధించిన లబ్ధిదారులను తప్పించే కుట్రలు జరుగుతున్నాయి. స్థానిక నేతల సహాయంతో అటువంటి వారి జాబితాను రహస్యంగా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు నెలల్లో జరిగిన కోతల్లో కూడా కొంత మందిని అదే తరహాలో.. స్థానిక నేతల ఒత్తిళ్ల కారణంగా తప్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

97.48 శాతం పంపిణీ

ఎన్టీఆర్ భరోసాలో భాగంగా జిల్లాలో గురువారం 1,59,090 మంది లబ్ధిదారులకు రూ.68.26 కోట్ల మేర పింఛన్లు అందజేశారు. తొలిరోజే శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అయితే గురువారం రాత్రి 8 గంటల వరకు 97.48 శాతం మేర పంపిణీ పూర్తయింది. మొత్తంగా 1,63,210 మంది లబ్ధిదారులకు రూ.70,05,23,000 అందించాల్సి ఉంది. అప్పుఘర్, జోడుగుళ్లపాలెంలో లబ్ధిదారులకు కలెక్టర్ పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభారాణి, యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఫణిరామ్ తదితరులు పాల్గొన్నారు.



జోడుగుళ్లపాలెంలో పింఛన్లు అందజేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఇసుక ఎక్కడైనా ఒకే ధర

- టన్ను రూ.1,076
- భీమిలి ధరనే అగనంపూడిలో అమలు
- రవాణా చార్జీలు కూడా ఖరారు

రవాణా చార్జీలు ఇలా..

10 కి.మీ వరకు	రూ.1,633
20 కి.మీ వరకు	రూ.2,035
30 కి.మీ వరకు	రూ.2,438

మహారాణిపేట : జిల్లాలోని రెండు ఇసుక డిపోల్లో ఒకే ధరకు విక్రయిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ తెలిపారు. అన్ని ఖర్చులు, వివిధ రకాల పన్నులు కలిపి టన్నుకు రూ.1076లు నిర్ణయించామని, ఇసుక కోసం లబ్ధిదారుడు వాహనాన్ని తెచ్చుకోవాలన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భీమిలి, అగనంపూడి డిపోల్లో 1.4 లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని, ఇది రెండు నెలల వరకు సరిపోతుందన్నారు. భీమిలి డిపోకి శ్రీకాకుళం నుంచి, అగనంపూడి డిపోకి గోదావరి నుంచి ఇసుక తీసుకొస్తున్నామని తెలిపారు. గతంలో అగనంపూడి వద్ద రూ.1394, భీమిలిలో రూ.1076 ఉండేదని.. దీంతో ఇసుక అవసరమైన వారు ఎక్కువ మంది భీమిలి వెళ్లేవారని, దీంతో ఆ ప్రాంతం రద్దీ ఏర్పడుతోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఒకే ధర నిర్ణయించినట్లు తెలిపారు. రవాణా చార్జీలు కూడా నిర్ణయించామని, ఆ ప్రకారం వినియోగదారుల నుంచి వసూలు చేయాలని, అదనంగా వసూలు చేస్తే బ్లాక్ లిస్టులో పెట్టడంతో చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాహనాన్ని కూడా సీజ్ చేస్తామన్నారు. రెండు డిపోల్లో సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. మైన్స్, రెవెన్యూ, పోలీసు అధికారులు కూడా అప్రమత్తంగా ఉంటున్నారన్నారు. కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌తోపాటు ప్రత్యేక సెల్ కూడా ఏర్పాటు చేశామని వివరించారు.

ఈ నెలా బియ్యంతోనే సరి!

- రేషన్ సరుకుల్లో కోత
- కూటమి ప్రభుత్వ హామీలు గాలికి..
- డీలర్లకు అందని కమీషన్లు
- నిత్యావసరాలు విడిపించేందుకు ఇబ్బందులు

మహారాణిపేట: ఎన్నికలకు ముందు కూటమి నేతలు రేషన్ లబ్ధిదారులకు అరచేతిలో స్వర్గం చూపించారు. ఇంటికి అవసరమైన అన్ని రకాల నిత్యావసరాలను పంపిణీ చేసేస్తామని ఊదరగొట్టారు. బియ్యం, పంచదార, కందిపప్పు, వంట నూనె, గోధుమపిండి, రాగిపిండి.. ఇలా అన్ని రకాల వస్తువులు అందిస్తామని డబ్బాలు కొట్టారు. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మిన కార్డుదారులు మరోసారి నయవంచనకు గురయ్యారు. రెండో నెల కూడా బియ్యం, రాగులతోనే సరిపెట్టారు. పంచదార కూడా ఇవ్వకుండా చేతులెత్తేశారు. కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకే కాకుండా రేషన్ దుకాణాల డీలర్లకు కూడా చుక్కలు చూపిస్తోంది. ఎన్నికలకు ముందు కమీషన్లు పెంచేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఆ హామీని నెరవేర్చకపోగా.. ఇవ్వాల్సిన నెలవారీ కమీషన్లు కూడా అందించడం లేదు. రెండు నెలలుగా కమిషన్లు రాకపోవడంతో డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వాగ్దానాలతో కడుపు నింపి..

ఎన్నికలకు ముందు చంద్రబాబు వాగ్దానాలతో ప్రజలు కడుపు నింపి.. అధికారం చేజిక్కించుకున్న తర్వాత పేదల కడుపు మాడ్చుతున్నారు. చంద్రబాబు పరిపాలన చరిత్రలోనే ఇచ్చిన హామీలు నెరవేర్చిన దాఖలాలు లేనప్పటికీ.. ప్రజలు ఆశతో నమ్మి కూటమి ప్రభుత్వానికి ఓట్లేసి గెలిపించారు.




ఈసారైనా ఇచ్చిన హామీలు నెరవేరుస్తారని ఆశించారు. కానీ తొలి నెలలోనే కూటమి ప్రభుత్వం అసలు రంగు బయటపడింది. కనీసం రెండో నెల నుంచి అయినా నిత్యావసరాలను పంపిణీ చేస్తారని భావించినప్పటికీ.. ఈసారి కూడా కందిపప్పు, గోధుమపిండి, వంటనూనె కేటాయింపులే లేకుండా చేశారు. కేవలం బియ్యం, రాగులు మాత్రమే పంపిణీ ప్రారంభించారు. ఈ నెల కనీసం పంచదార కూడా అందించడం లేదు. దీంతో జిల్లాలోని 5,12,619 మంది కార్డుదారులు పంచదార నుంచి ఇతర నిత్యావసరాలు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది కార్డుదారులకు భారంగా మారింది.

రెండు నెలలుగా అందని కమీషన్లు

కార్డుదారులకే కాకుండా రేషన్ దుకాణ డీలర్లకు కూటిమి ప్రభుత్వం షాకిచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు డీలర్లకు కమీషన్ అందించడం లేదు. దీంతో జిల్లాలోని 625 మంది డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి కమీషన్ పెంచాలని డీలర్లు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు, చంద్రబాబు డీలర్లకు భారీగా కమీషన్ పెంచేస్తామని హామీ ఇచ్చేశారు. దీంతో వారు కూడా కమీషన్లు పెరుగతాయని సంబరపడిపోయారు. కూటమి నేతలకు ఓట్లేసి గెలిపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కమీషన్ పెంచకపోగా.. అసలు కమీషనే ఇవ్వడం లేదు. దీంతో డీలర్లు కక్కలేక మింగలేక, పరిస్థితులు ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి గతంలో ఏ నెల కమీషన్ ఆ నెల అందేది. కానీ ఈ కూటమి ప్రభుత్వం రెండు నెలలు గడిచినా కమీషన్ రాకపోవడంతో ఇండెంట్ పెట్టి కనీసం బియ్యం కూడా విడిపించుకోలేని పరిస్థితిలో కొంత మంది డీలర్లు అవస్థలు పడుతున్నారు. అలాగే షాపు అద్దెలు, విద్యుత్ చార్జీలు, ఇతర నిర్వహణ భారంతో సతమతమవుతున్నారు. కమీషన్లు ఇప్పించేలా చూడాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కమీషన్ పెంచుతామని ఆశపెట్టి.. అసలు కమీషనే ఇవ్వకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

మహారాణిపేట: జిల్లాలో స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎస్.హరేందిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఆయన సమీక్ష చేశారు. అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయా శాఖల పరిధిలో అత్యుత్తమ సేవలందించిన వారి పేర్లను ఈ నెల 5లోగా పంపించాలని సూచించారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేలా వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని, స్టాళ్లు, శకటాలు సిద్ధం చేయాలన్నారు. పోలీస్ మైదానంలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జరిగే వేడుకలకు ప్రజలు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర ప్రముఖులు ఆహ్వానితులేనని పేర్కొన్నారు. ఆయా శాఖల ప్రగతి నివేదికలను ఈ నెల 5వ తేదీలోగా పంపించాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా పతాకావిష్కరణ ఉంటుందని వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్వో టి.సీతారామ్మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏడీసీపీ నారాయణరావు, ఏసీపీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జేసీ మయూర్ అశోక్

జాతీయ స్థాయి రోల్‌బాల్ స్కేటింగ్‌కు బుల్లయ్య విద్యార్థిని

సీతంపేట : గత నెల 27, 28 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ స్కేటింగ్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థిని బంగారు పతకాన్ని సాధించింది. కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం.లక్ష్మితారెడ్డి రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించడమే కాకుండా ఈ నెల 8వ తేదీ నుంచి న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి ఐస్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. గత ఏడాది గుంటూరులో జరిగిన రోల్‌బాల్ స్కేటింగ్‌లో ప్రతిభ చూపిన లక్ష్మితారెడ్డి జాతీయ పోటీలకు ఎంపికై నట్టు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధుకుమార్ విద్యార్థిని అభినందించి మరిన్ని పతకాలు తేవాలని ఆకాంక్షించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్

సీ కేడెట్ కార్ప్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ సిటీ: విశాఖ యూనిట్ సీ కేడెట్ కార్ప్స్‌లో చేరేందుకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యమున్న 10 నుంచి 12 ఏళ్ల మధ్య (2012 ఆగస్టు 1 నుంచి 2014 జూలై 31) గల 5, 6, 7 తరగతులు చదువుతున్న బాలబాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఈ నెల 4వ తేదీ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఐఎన్ఎస్ సర్కార్స్ కమాండ్ స్విమ్మింగ్ పూల్ వద్ద దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తు తీసుకునేందుకు అభ్యర్థులు ఏదైనా గుర్తింపు కార్డు, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు అందించాలి. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 11వ తేదీ ఉదయం 8 నుంచి 11 గంటల మధ్య అదే వేదిక వద్ద సమర్పించాల్సి ఉంటుంది. ఈ నెల 18న అభ్యర్థులకు రాత, శారీరక, మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారు. ఎంపిక సమయంలో విద్యార్థులు వారి స్కూల్ యూనిఫాం ధరించి తల్లిదండ్రులతో కలిసి రావాల్సి ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు సెప్టెంబర్ 8లోగా కాల్ లెటర్లను వారి చిరునామాలకు పంపిస్తారు. అదే నెల 15 నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. ఎంపికైన వారికి ప్రతీ ఆదివారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్క్వాడ్ డ్రిల్, రైఫిల్ డ్రిల్, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్, బోట్ పుల్లింగ్, బ్యాండ్, సెమాఫోర్, రిగ్గింగ్, సీమాన్‌షిప్ వంటి వాటిలో శిక్షణ ఇస్తారు.

ఆ శివయ్యే నాటకం వైపు నడిపించాడు

- తెలుగులోనే నాటకానికి నిరాదరణ
- నాటక రంగానికి జీవం పోసేందుకు కృషి
- నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణి
- భరణికి రంగసాయి జీవన సాఫల్య పురస్కారం

మద్దిలపాలెం: 'నాటక రంగం వైపు ఆ శివయ్యనే నన్ను నడిపించాడు. నాటకం ద్వారా డబ్బులు సంపాదించాలనే కసితోనే రచనలు, నాటకాలు సాగాయి. నా గురువు రాళ్లపల్లి అప్పులతో బాధలు పడిన దృశ్యం నా హృదయాన్ని తొలిచేసింది. ఆ కసితోనే నాటకం అంటే డబ్బులు రావాలనే దిశగా రచనలు చేశాను. చేస్తున్నాను' అని ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి భావోద్వేగంగా ప్రసంగించారు. నాటకం ద్వారా రంగస్థల కళాకారులు దిశ, దశను మార్చేందుకు తన వంతు కృషి చేశానన్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గురువారం రంగసాయి 14వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. రంగసాయి జీవన సాఫల్య పురస్కారంతో తనికెళ్ల భరణిని ఘనంగా సత్కరించారు. అనంతరం తనికెళ్ల భరణి మాట్లాడుతూ ప్రపంచమంతా నాటకం వర్ధిల్లుతోందని, తెలుగులో మాత్రం నాటకం అప్పులతో కూరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్ ట్రాక్ అనే నాటకం 65 ఏళ్లగా ఒకే వేదికపై ప్రదర్శిస్తూనే ఉన్నారని, ఆ నాటకాన్ని 52 యూరోలతో టికెట్ కొని చూశానని గుర్తు చేశారు. తెలుగునేలపై నాటకాన్ని చూడడానికి టికెట్లు దొరకనంతగా ప్రేక్షకులు ఆదరణ లభించినప్పుడే తెలుగు నాటకం వర్ధిల్లుతుందన్నారు. అందుకు తన వంతు కృషి చేస్తూనే ఉంటానన్నారు. తెలుగు నాటకానికి కనక వర్షం కురవాలన్న కసితోనే కొక్కొరోకో నాటకం రచించానన్నారు. ఆ నాటకానికి పురస్కారం రావడంతో నా రచనలు ఊపందుకున్నాయన్నారు. తొలి నాటకం ప్రదర్శిస్తే రూ.32 వేలు రావడంతో తన సంపాదన మొదలైందన్నారు. నా గురువు రాళ్లపల్లి నాటకం కోసం పడిన అప్పుల బాధలు అన్నీఇన్నీ కావన్నారు.అందుకే నాటకంలో వినూత్నంగా మైమ్‌ను తీసుకువచ్చానన్నారు. నా ప్రతి నాటకంలో మైమ్ పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. గోగ్రహణం నాటకానికి జాతీయ పురస్కారం లభించడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా శివస్తుతులను ఆలపించారు. నటుడు ప్రియదర్శి మాట్లాడుతూ తెలుగు సినిమా సంపద తనికెళ్ల భరణి అని అన్నారు. కార్యక్రమంలో రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, ప్రముఖ దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ, వీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, పైడా కృష్ణప్రసాద్, విజయనిర్మణ్ విజయకుమార్, సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, బాదంగీర్ సాయి, చిత్రంలో నటుడు ప్రియదర్శి

ఐదుగురికి రంగసాయి థియేటర్ అవార్డులు

నాటక రంగంలో పలు విభాగాలలో రాణిస్తున్న రాష్ట్రంలో ఐదుగురికి ఈ సందర్భంగా రంగసాయి థియేటర్ అవార్డులు అందజేశారు. వీరిలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ప్రముఖ హరిశ్చంద్ర రంగస్థల కళాకారిణి కె.మంగాదేవి, దర్శకుడు ఎం.ఎస్.భాషా, బి.వి.రామారావు, యువ కళాకారుడు సతీష్ కుమార్, బాల కళాకారుడు బగాది రితీష్ చంద్‌లను అవార్డులతో సత్కరించారు.

వీఐపీల గన్‌మెన్ సిబ్బంది కోసం అర్హత పరీక్షలు



సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : వీఐపీల భద్రతకు కేటాయించే పీఎస్ఓ/గన్‌మెన్‌ల ఎంపికకు సంబంధించి ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లకు శారీరక దారుఢ్య అర్హత పరీక్షలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి గురువారం స్వయంగా పరిశీలించారు. సిటీ సెక్యూరిటీ వింగ్(సీఎస్‌డబ్ల్యూ)లో భాగమైన పీఎస్ఓ/గన్‌మెన్‌గా విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరూ పూర్తి ఫిట్‌నెస్ కలిగి ఉండాలని సూచించారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరిగేలా సీపీ స్వయంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన 3 కే రన్, ఇతర ఈవెంట్లను పర్యవేక్షించారు. శుక్రవారం కూడా ఈ పరీక్షలు జరుగుతాయి.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం



ఐడీ బాబు

సబ్బవరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐడి బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జస్టిస్ చంద్ర చూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తిలో సంచలన తీర్పునిచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఎంతో సమర్థనీయమని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛగా వర్గీకరణ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాలు అన్ని విధాల సర్వం కోల్పోయి ఆశ,నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ఈ తీర్పునివ్వడం హర్షణీయమన్నారు.

'కోడ్' ఎఫెక్ట్.. హోర్డింగులు, బ్యానర్ల తొలగింపు





ఫ్లెక్సీలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



మహారాణిపేట : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నగరంలో రాజకీయ నాయకుల హోర్డింగులు, బ్యానర్ల తొలగింపు కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఎంవీపీ కాలనీ, సత్యం జంక్షన్ల వద్ద ఉన్న పలువురి నాయకుల ప్రచార హోర్డింగ్‌లు, బ్యానర్లను తొలగించారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్దార్ వంతెనపై రాకపోకలు బంద్



బైకర్లను వెనక్కి పంపిస్తున్న పోలీసులు

కంచరపాలెం: జ్ఞానాపురం కాన్వెంట్ కూడలి ప్రాంతం నుంచి గాజువాక, పారిశ్రామిక ప్రాంతానికి వెళ్లే ప్రధాన మార్గం.. నేవల్ డాక్‌యార్డ్ సమీపంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనను గురువారం నుంచి మూసివేశారు. ఈ మేరకు వంతెనపై ఎవరూ రాకపోకలు సాగించకుండా ఇటు హార్బర్ స్టేషన్, అటు మల్కాపురం పోలీస్‌స్టేషన్ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు. శాశ్వత ప్రాతిపదికన వంతెన మరమ్మతులు జరుగుతున్నాయని.. స్థానికులు, వాహనచోదకులు సహకరించాలని హార్బర్ జోన్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు కోరారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.70,360
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.64,500
వెండి(కిలో):	రూ.91,700

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.100
స్కిన్	: రూ.170
స్కిన్‌లెస్	: రూ.180

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	450.00
విజయనగరం	454.00
శ్రీకాకుళం	454.00

రామాద్రిలో షూటింగ్ సందడి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించి హీరో ప్రియదర్శి, నటుడు, దర్శకుడు తనికెళ్ల భరణిపై పలు సన్నివేశాలను ఆలయ ప్రాంగణంలో, శిలా తోరణం వద్ద చిత్రీకరించారు. మరో వారం రోజుల పాటు ఆర్‌కేబీచ్ –భీమిలి బీచ్ ప్రాంతాల్లో సినిమా చిత్రీకరణ ఉంటుందని యూనిట్ తెలిపింది.



లొకేషన్‌లో నటుడు ప్రియదర్శి

అందరి సహకారంతో గిరి ప్రదక్షిణ విజయవంతం

- సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : అన్నిశాఖల సమన్వయంతో ఈ ఏడాది చందనోత్సవం, గిరి ప్రదక్షిణ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆయా శాఖల అధికారులు అందించిన సహకారం మరవలేనివన్నారు. చందోత్సవం, గిరిప్రదక్షిణ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన ఆయా శాఖల అధికారులు, మీడియా ప్రతినిధుల అభినందన సభను గురువారం సింహగిరిపై నిర్వహించారు. ఆలయ ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఈవో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో గిరి ప్రదక్షిణ, చందనోత్సవం విజయవంతంగా నిర్వహించామన్నారు. ఆయా శాఖల అధికారులను ఈవో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, జీవీఎంసీ సీఈ, సింహాచలం దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, కనకమహాలక్ష్మి దేవస్థానం ఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే గడిచిన చందనోత్సవం, గిరి ప్రదక్షిణ ఉత్సావాల్లో భక్తులకు సేవలందించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కూడా సాయంత్రం ప్రత్యేక సమావేశంలో ఈవో సత్కరించారు.



నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తిని సత్కరిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

30 తులాల బంగారు ఆభరణాల చోరీ



ఇంట్లో చిందరమందరంగా పడి ఉన్న సామగ్రి

- ఓ పాఠశాల అధినేత ఇంట్లో దొంగతనం
- సిబ్బంది జీతాల కోసం ఉంచిన రూ.2 లక్షల అపహరణ

మల్కాపురం : సిబ్బంది జీతాల కోసం ఉంచిన నగదు, కుమార్తె వివాహం కోసం ఉంచిన బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన 61వ వార్డు జనతాకాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు...జనతాకాలనీలో సాగర్ పబ్లిక్ స్కూల్ అధినేత రమేష్ నాయుడు మూడంతస్తుల భవనంలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి 10 గంటల సమయంలో రమేష్‌నాయుడు కుటుంబ సభ్యులంతా మూడో ఫ్లోర్‌లో నిద్రపోయేందుకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున 5 గంటలకు నిద్ర లేచి, ఫస్ట్ ఫ్లోర్‌కు రాగా..తలుపు పగలుగొట్టి ఉండడాన్ని చూసి కంగారు పడ్డాడు. భార్యను పిలిచి ఫస్ట్ ఫ్లోర్‌లోని తన గదిలో ఉన్న బీరువాను తెరిచి చూడగా.. చిందరవందరగా వస్తువులు ఉండడాన్ని గమనించారు. సిబ్బంది జీతాల కోసం ఉంచిన రూ.2లక్షలతో పాటు కుమార్తె వివాహం కోసం ఉంచిన 30 తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. వెంటనే పోలీసులకు సమాచారమందించారు. మల్కాపురం లా అండ్ ఆర్డర్ సీఐ విద్యాసాగర్, క్రైం ఏసీపీ శ్యామలరావు, క్రైం సీఐ శ్రీనివాస్ రావు, ఎస్ఐ ఎంవీ రమణలు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ సభ్యులు వచ్చి అక్కడ వేలుముద్రలను సేకరించారు. బాధితుని ఇంటి వద్ద సీసీ కెమెరాలు, ఆ చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



దొంగల వేలు ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఫిర్యాదుకు స్పందించిన సీపీ

- సాగర్‌నగర్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు.. సాగర్‌నగర్ ప్రాంతాల్లో గురువారం రాత్రి సీపీ శంఖబ్రత బాగ్చి పర్యటించారు. బుధవారం రాత్రి ఆయనకు అందిన ఓ ఫిర్యాదు మేరకు ఆకస్మికంగా పర్యటించారు. సాగర్ నగర్, ఈనాడు లేఅవుట్, ఎన్టీఆర్ పార్కు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను స్వయంగా గమనించారు. విద్యుత్‌దీపాలు లేకపోవడం, పొదలు దట్టంగా ఉండటంతో ఈ ప్రాంతాల్లో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి ఆస్కారం ఉందని భావించారు. వెంటనే ద్వారకా ఇన్‌చార్జి ఏసీపీ సీహెచ్ వివేకానంద, జీవీఎంసీ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి, పొదలు తొలగించాలని ఆదేశించారు.



స్థానికులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ప్రజలందరూ 79950 95799 నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో ఎవరు లంచం అడిగినా, తీసుకున్నా, ఎటువంటి సమస్యలు ఉన్నా పై నంబర్‌కు ఫోన్ చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి కోరారు. ఇదిలా ఉండగా సీపీ ఆదేశాల మేరకు కొద్ది గంటల్లోనే విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు.

లక్ష వినాయక ప్రతిమల తయారీకి శ్రీకారం

- పర్యావరణహిత వినాయక చవితే లక్ష్యం
- భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కుమార స్వామి



మాట్లాడుతున్న భారత కిసాన్ సంఘ్ కార్యవర్గ సభ్యుడు కుమారస్వామి

మద్దిలపాలెం: పర్యావరణ పరిరక్షణకు లక్ష మట్టి వినాయక ప్రతిమల తయారీకి శ్రీకారం చుట్టామని భారత కిసాన్ సంఘ్ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి తెలిపారు. శివాజీపాలెంలోని ప్రకృతి ఆధారిత రైతు సంఘం కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ వేదికగా మట్టి వినాయక ప్రతిమల తయారీపై పోటీలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో ప్రజలంతా పాల్గొవాలన్నారు. మట్టి ప్రతిమల తయారీపై ఆసక్తి ఉన్న వారికి ఇది ఒక వేదికగా నిలుస్తుందన్నారు. దీని ద్వారా వారిలో దాగిన వున్న సృజనాత్మకతను వెలికితీయడమేకాకుండా ప్రకృతిని కాపాడానికి చక్కని మార్గంగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో ప్రకృతి ఆధారిత వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యం వర్మ, సంస్థ కార్యదర్శి పాలెం నేచురల్స్ అశోక్, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, జల శక్తి మిషన్ విశ్రాంత అధికారి కృష్ణ, రంగాచార్యులు పాల్గొన్నారు.

వినయ్‌కుమార్‌పై రౌడీషీట్

- కానిస్టేబుల్‌పై దాడి కేసులో పోలీసుల చర్యలు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంజీవరావు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ బ్లూకోర్ట్ కానిస్టేబుల్ రాజు నాయుడుపై దాడికి పాల్పడిన కొర్రయ వినయ్‌కుమార్‌పై (25) రౌడీషీట్ ఓపెన్ చేయనున్నట్లు ఎంవీపీ సీఐ సంజీవరావు తెలిపారు. భార్యాభర్తల మధ్య గొడవకు సంబంధించి 112కి వచ్చిన ఫిర్యాదు మేరకు బ్లూకోర్టు కానిస్టేబుల్ రాజు నాయుడు ఘటన స్థలానికి వెళ్లగా వినయ్‌కుమార్ అతనిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కానిస్టేబుల్ రాజు నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్టు సీఐ సంజీవరావు, ఎస్ఐ శ్రీనివాస్ గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. నిందితుడిపై హత్యాయత్నం, ప్రభుత్వ విధులకు అడ్డుపడటంపై వంటి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వినయ్‌కుమార్‌పై ఎంవీపీ పోలీసు స్టేషన్‌తో పాటు త్రీటౌన్, దిశ పోలీసు స్టేషన్ల పరిధిలో ఇప్పటికే 9 కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో అతనిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

బిర్యానీ తిన్న 21 మంది విద్యార్థులకు అస్వస్థత

- ఇద్దరి పరిస్థితి విషమం • కేజీహెచ్‌కు తరలింపు



ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరావు

గంట్యాడ: చికెన్ బిర్యానీ తిన్న పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... గంట్యాడ మండలం కరకవలస గ్రామంలోని ప్రేమవెలుగు సేవా సంస్థ ఆశ్రమంలో ఎస్.కోట, అనంతగిరి, పాచిపెంట, అరకు, మారికవలస ప్రాంతాలకు చెందిన 46 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వీరంతా కరకవలస, రామవరం, పాతశాలల్లో చదువుతున్నారు. ఈ నెల 30వ తేదీ రాత్రి విద్యార్థులకు నిర్వాహకులు చికెన్ బిర్యానీ పెట్టారు. అది తిన్న తర్వాత ఇద్దరు విద్యార్థులకు వాంతులు, విరేచనాలు కావడంతో నిర్వాహకులు ఘోషా ఆస్పత్రికి తరలించారు. 31వ తేదీ ఉదయం మరో నలుగురికి వాంతులు విరేచనాలు కావడంతో వారిని కూడా ఘోషా ఆస్పత్రిలో చూపించిన తర్వాత వారి తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. వారిలో 21 మంది విద్యార్థులకు మళ్లీ వాంతులు, విరేచనాలు ప్రారంభం కావడంతో ఎస్.కోట ఆస్పత్రిలో గురువారం వారి తల్లిదండ్రులు చేర్పించారు. వీరిలో మజ్జి సన్యాసమ్మ (9), జన్ని నవ్య (13)ల పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు.

విద్యార్థులను పరామర్శించిన డీఎంహెచ్‌వో

ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు గురువారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకున్న వరకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను డీఎంహెచ్‌వో ఆదేశించారు.

ఆశ్రమాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే విషయం తెలుసుకున్న వెంటనే తహసీల్దార్ నీలకంఠశ్వర రెడ్డి, డీఎంహెచ్ఓ భాస్కరరావు కరకవలసలో ఉన్న ప్రేమ వెలుగు సేవా సంస్థ ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. ఎంత మంది విద్యార్థులు ఉంటున్నారు, ఎలాంటి ఆహారం తీసుకున్నారన్న వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం నిర్వహణ అనుమతులపై ఆరా తీశారు. వసతి గృహ నిర్వహణకు అనుమతులు లేవని తెలిసింది. దీనిపై విచారణకు హాజరు కావాలని తహసీల్దార్ నీలకంఠశ్వరరెడ్డి నోటీస్ ఇచ్చారు. ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు అందించినట్టు తహసీల్దార్ తెలిపారు.

'ఇన్‌స్టా'.. ఇంటికి చేర్చింది

- కరీంనగర్ నుంచి విశాఖ వచ్చేసిన యువకుడు
- మతిస్థిమితం లేక రోడ్లపైనే జీవనం
- బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం
- చికిత్స అందించి కుటుంబ సభ్యుల చెంతకు..



రమేష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, షెల్టర్ మేనేజర్ మమత

విశాఖ విద్య: మతి స్థిమితం లేక ఇంటి నుంచి బయటకు వచ్చేసిన వ్యక్తి నాలుగు నెలల తర్వాత ఇన్‌స్టా గ్రామ్‌లో కనిపించడంతో బంధువులు పట్టరాని ఆనందంలో మునిగితేలారు. విశాఖలోని జీవీఎంసీ షెల్టర్‌లో ఉన్నాడని తెలుసుకున్న వారు కరీంనగర్ జిల్లా కోరుట్ల గ్రామం నుంచి వార్డు కౌన్సిలర్ సహాయంతో గురువారం ఇక్కడకు వచ్చారు. అతన్ని తమ వెంట తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళితే. నాలుగు నెలల కిందట గాజువాక సింథియా సమీపంలో ఓ వ్యక్తి మతిస్థిమితం లేక.. ఫుట్‌పాత్‌పై తిరుగుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడకు చేరుకుని.. అతనికి సపర్యలు చేసి షెల్టర్‌కు తీసుకొచ్చారు. రమేష్ అని తప్పితే.. మినహా మరే ఇతర వివరాలు చెప్పకపోవడంతో షెల్టర్‌లోనే ఆశ్రయం కల్పించారు. మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించారు. తర్వాత హైదరాబాద్‌లో తెలిసిన వ్యక్తి ప్రేమ్‌కుమార్ సాయంతో రమేష్ వివరాలను షెల్టర్ మేనేజర్ మమత ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్ట్ చేయించారు. రమేష్ కుటుంబ సభ్యులు దీన్ని చూసి ఆమెకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. కానీ వారు వైజాగ్ వచ్చి రమేష్ తీసుకువెళ్లడానికి ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో అక్కడి కౌన్సిలర్ సూర్యనారాయణకు విషయాన్ని తెలియజేశారు. దీనిపై స్పందించి రమేష్‌ను తీసుకెళ్లేందుకు వారితో సహా ఆయన గురువారం విశాఖ వచ్చారు. పోలీసుల సమక్షం రమేష్ తమ కుటుంబ సభ్యులను గుర్తు పట్టాడు. దీంతో జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు సమక్షంలో రమేష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. తప్పిపోయిన ఎంతో మంది అభాగ్యులకు ఆశ్రయం కల్పిస్తూ.. వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేలా శ్రద్ధ తీసుకుంటున్న అధికారులకు కౌన్సిలర్ సూర్య నారాయణ ధన్యవాదాలు తెలిపారు.